
# ముసలిపీనుగ!

వర్ణమన్నాటి మధుసూదనరావు



ఎదురింటి మాధవయ్యంటే పార్వతికి భలే ఒళ్ళు మంట! దానిక్కారణం...ఆయన రోజూ ఉదయం కాఫీ టైముకి...పార్వతి భర్త పరమేశ్వర్‌తో పనున్నట్టుగా తమ యింటికి తగలడ్డమే!

అక్కడికీ చాలాసార్లు భర్తమీద విసుక్కుంది పార్వతి. ''మీకసలు కాస్తన్నా ఇంగితమే లేదు. ఏదో చెప్పి ఆ మాధవయ్యను వదిలించుకోవాల్సిందిపోయి 'పారూ! కాఫీ ప్రట్టా...మీ బాబాయిగారికి' అంటూ మీరే పురమాయిస్తారాయె ఖర్మ!'' అంటూ.

''పోనీలేవోయ్ పాపం! పెద్దముండావాడు'' వచ్చ చెప్పబోయాడు పరమేశ్వర్.

కస్సుమంది పార్వతి ''పోనీ...లేనివాడయితే అనుకోవచ్చు! ఈయనకేం రోగం? రెండు తరాలవాళ్ళు తిన్నా తరిగిపోని ఆస్తి పాస్తులున్నాయి గదా! ఓ వంటవాణ్నో... వంట మనిషినో పెట్టుకుని తనకు కావలసిన కాఫీ టిఫిన్లు... భోజనం రుచులు రుచులుగా చేయించుకుని తిని చావొచ్చుగా?''

దాంతో పరమేశ్వర్ మౌన వ్రతం అవలంబించక తప్పలేదు.

మర్నాడుదయం...కాఫీ వేళకు తయారయ్యాడు మాధవయ్య. ''ఏంవోయ్ పరమేశ్వర్! రామేశ్వరం వెడదామని వుందోయ్...నీకు రూటు తెలుసా?'' అంటూ.

కిచెన్‌లో కాఫీ తయారు చేస్తున్న పార్వతికి పట్టరాని ఆగ్రహం వచ్చేసింది. ''నీ రామేశ్వరం సంగతేమోగానీ... నువ్వు మాత్రం మాకు రోజూ శనేశ్వరం!'' అంటూ సణుక్కుంది.

''పారూ! మీ బాబాయిగారిక్కూడా కాఫీ తీసుకురా'' పరమేశ్వర్ గట్టిగా అన్నాడు డ్రాయింగ్ రూంలోంచి.

'కాఫీ కాదు విషం తెస్తాను!' అనుకుంటూ ట్రేలో రెండు కప్పుల కాఫీని తీసుకుని వచ్చి...''తీసుకోండి బాబాయ్‌గారూ! మీ కోసమే తెచ్చాను'' అంది వర్మ గర్వంగా.

''చాలా సంతోషం తల్లీ!'' అంటూ ఆత్రంగా అందుకున్నాడు మాధవయ్య.

పరమేశ్వర్‌కి కూడా కప్పు చేతికిచ్చి మొహం మాడ్చుకుని లోపలికి వెళ్ళిపోయింది పార్వతి.

మాధవయ్య కాఫీ తాగేసి కాసేపు బలవంతపు బాతాఖానీ కొట్టేసి... వెళ్ళిపోయాడు.

మాధవయ్య వెళ్ళగానే మళ్ళీ భర్తమీద మూడో కాలుమీద లేచింది పార్వతి. ''ఈసారి మీరు ఆ ముసలాడు వచ్చినప్పుడు కాఫీ తెమ్మని పిలిచారో వేడి వేడి కాఫీ వాడి బోడి తలమీద పోస్తాను. కుయ్యో... మెర్రో...అంటూ చస్తాడు!''

ఆమె అపర కాళికావతారం చూసి కిక్కురుమనకుండా అక్కడి నుంచి నిష్క్రమించాడు పరమేశ్వర్.

తరువాత రోజు ఉదయం మాధవయ్య మళ్ళీ తయారు. ''ఏం పరమేశ్వర్! మొన్న మనం అనుకున్నాంచూడు...ఆ విషయం మీద నీ అభిప్రాయం ఏమిటి?'' అంటూ.

'నీ బొంద' అనుకుంది పార్వతి వంటింట్లోంచి.

ఏదో చెప్పాడు పరమేశ్వర్.

''మీ బాబాయ్‌గారికి కాఫీ ప్రట్టా పారూ'' అనబోయిన పరమేశ్వర్ పార్వతి నిన్న చేసిన హెచ్చరిక గుర్తొచ్చి ఉలిక్కిపడి నాలుక్కొరుక్కుని నిమ్మకు నీరెత్తినట్టుగా కూర్చున్నాడు.

భర్తమీద ప్రేమ పొంగిపోయింది పార్వతికి. తన మాటను తు.చ. తప్పకుండా పాటించే భర్తంటే ఏ భార్యకు ప్రేముండదు?

ఈ ముసలి నక్కగాడు వెళ్ళిన తరువాత భర్తకు సెగలు పొగలు కక్కే కాఫీ ఆప్యాయంగా ఇద్దామనుకుంది పార్వతి సంతోషంగా.

కానీ...ఆమె సంతోషం మరుక్షణంలోనే నీరుగారిపోయింది.

''అమ్మాయ్'' అన్నాడు మాధవయ్య తమ కూర్చున్న చోటునుంచే.

కావాలనే పలకలేదు పార్వతి. 'బేవార్సు' కాఫీ కోసం ఎంత ఆప్యాయత ఒలకపోస్తున్నాడో!' అనుకుంది ఈసడింపుగా.

''అమ్మాయ్! నీ కాఫీ కోసమే వచ్చాడమ్మా ఈ బాబాయ్'' ఈసారి మాధవయ్య కుండ బద్దలు కొట్టినట్టు అసలు విషయం బయటపెట్టేశాడు.

ఇంకేం చేస్తుంది పాపం? పళ్ళు పటపట కొరుక్కోవటం బలవంతాన ఆపుకుని ''వస్తున్నా బాబాయ్! తెస్తున్నా!'' అంటూ రెండు కప్పులతో కాఫీ తీసుకెళ్ళి చెరొకటీ ఇచ్చింది పార్వతి.


''థాంక్స్ తల్లీ!'' అంటూ ఆమె ముఖంలోకి ఒకసారి చూసి తల దించుకుని కాఫీ గటగటా తాగేసి కప్పు ఇచ్చి పంపాడు మాధవయ్య.


ఆయన వెళ్ళిం తర్వాత మళ్ళీ మండిపడింది పార్వతి.

''ఈసారి నేను నిన్ను కాఫీ తెమ్మని చెప్పలేదుగా పారూ!'' అంటూ సంజాయిషీ చెప్పుకున్నాడు పరమేశ్వర్.

''నా కోపం మీ మీద కాదండీ...ఆ ముసలి పీనుగని ఎలా వదిలించుకోవటమా అని! తల్లీ కాఫీ ప్రట్టా...! అని నన్నే స్వయంగా అడిగేస్తున్నాడు కదా! ఇప్పుడేం చెయ్యాలి? భార్య పచ్చింది. కొడుకు దూరంగా ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఇక్కడెందుకూ ఈ ముసలి శాల్తీ? కొంపా గోడు అమ్మేసుకుని ఆ కొడుకు దగ్గరకే జేరి కోడలి చేత కాఫీలు... టిఫిన్లు...తన కిష్టమైన వంటలూ చేయించుకుంటూ అక్కడే పడి చావచ్చుగా...?'' అంటూ రుసరుసలాడింది పార్వతి.

తను సమాధానం ఏమీ చెప్పలేదన్నట్టుగా వుండి





పోయాడు పరమేశ్వర్.

ఆ సాయంత్రం భర్త ఇంటికి రాగానే "ఏవండోయ్ మీకో శుభవార్త" అంది పార్వతి.

"ఏమిటది పారూ?"

"ఈ పీనుగ లేడూ...?"

"ఎవరూ మాధవయ్యగారా?"

"గారూ...అనకండి నాకు ఒళ్ళు మండుతుంది. గాడూ అనండి."

"సరే చెప్పు"

"రేపు మధ్యాహ్నం రామేశ్వరం బయలుదేరి వెడుతున్నాడట. ఓ నెల రోజులుదాకా వుంటాడట అక్కడ. అబ్బ! నాకెంత సంతోషంగా వుందో" కేరింతలు కొట్టినంత పనిచేసింది పార్వతి.

కాసేపటిలో వచ్చాడు మాధవయ్య.

"రండి! రండి!" అంటూ ఆహ్వానించాడు పరమేశ్వర్.

కూర్చున్నాడు మాధవయ్య. ఆయన చేతిలో ఒక పాకెట్టుంది.

ఇప్పుడెందుకు తగలడ్డట్టూ...కాఫీ కావాలని అడగడు కదా! అనుకుంది పార్వతి. ఆయన రాకకు చాలా అసహనంగా వుందామె.

ఆమె అనుమానమే నిజమయింది.

"అమ్మాయ్ పార్వతీ! కాస్త కాఫీ కలిపి ఇవ్వమ్మా! రేపటి నుంచి కొన్నాళ్ళ వరకూ నీ కమ్మటి కాఫీ ప్రాప్తం వుండదమ్మా! ఈ ముసలివాడికి. రేపు తెల్లవారుఝామున బయలుదేరి విజయవాడ బస్సులో వెళ్ళి అక్కడి నుంచి రామేశ్వరం వెడుతున్నానమ్మా. మళ్ళీ నెల రోజులకు గానీ తిరిగి రాలేను."

"క్షమించండి బాబాయిగారూ!" అంది పార్వతి కోపాన్ని లోలోపలే దిగమింగుకుంటూ.

"ఏమిటమ్మా!"

"పాలు కాచిన ఇందాకే పిల్లి తాగిపోయింది బాబాయిగారూ! నోరు తెరిచి మీరు కాఫీ అడిగితే ఇవ్వలేకపోతున్న దురదృష్టవంతురాల్ని" అంది ఎంతో బాధపడుతున్నట్టు నటిస్తూ.

"పర్లేమ్మా! దానికేముందిగానీ...నే వస్తాను. ఇదిగో...ఇదుంచు!" తనచేతిలో పాకెట్టును ఆమె చేతిలో వుంచి "వస్తానయ్యా పరమేశ్వర్... రేపు మిమ్మల్ని మళ్ళీ కలవడం కుదరదు" అంటూ వెళ్ళిపోయాడు మాధవయ్య.

ఆత్రంగా పాకెట్టు విప్పి చూసిన పార్వతి సంతోషంతో ఎగిరి గంతేసినంత పనిచేసి కీచుగా అరిచింది. "కంచిపట్టు చీర! హే! ఇదిగో బిల్లు ఖరీదు రెండు వేలు."

"అదేమిటి పారూ! ఆ కాగితం ఏమిటో చూడు" అన్నాడు పరమేశ్వర్ విస్మయంగా.

అప్రయత్నంగా పైకి చదివేసింది పార్వతి.

"అమ్మాయ్ పార్వతీ! నువ్వు రోజూ నాకిచ్చే కాఫీకి లంచం కాదమ్మా ఈ పట్టుచీర! నీకు బాబాయ్ లాంటి ఈ వృద్ధుడు నిండు మనసుతో ఆశీర్వదించి ఇచ్చిన కానుక తల్లీ! స్వీకరించు.

పోతే...ఈ బాబాయ్‌వి పాము చవులు తల్లీ! నేను పనిగట్టుకుని మీ ఇంటికి ప్రొద్దున పూట కాఫీ టైముకు రావడం...నేను వెళ్ళిన తరువాత నువ్వు నీ భర్తతో నీ అసంతృప్తిని వ్యక్తం చెయ్యడం నాకు తెలియదని అనుకోకు.

కానీ నేను అసహాయుణ్ణి తల్లీ! ఎందుకో చెప్పనా అమ్మా!

సాధారణంగా తండ్రులు ముందుగా మగపిల్లవాడు కావాలని కోరుకుంటారు కానీ నాకు మాత్రం మహాలక్ష్మి లాంటి కూతురు పుట్టాలని వుండేది. ప్చ్! ఆ భగవంతుడు ముందూ వెనుకలుగా కూడా నా కోరికను మన్నించలేదు. ఫలితంగా నాకు ఏకైక పుత్రుడే జన్మించాడు.

నా పుత్ర రత్నాన్ని ఖరీదైన చదువులు చదివించటంతో వాడెప్పుడూ నాకు దూరంగానే వుంటుండేవాడు. ఇక ఇప్పటి సంగతి మీకు తెలిసిందేగా! వాడు పే...ద్ద ఉద్యోగంలో ఢిల్లీలో వున్నాడు. నేను ఆప్యాయంగా వాడి దగ్గరకు వెళ్ళినా వాడికి నాతో గడిపే ఓపిక తీరిక రెండూ వుండవు. అమిత ధనవంతురాలైన నా కోడలు నన్నెలా చూస్తుందో తెలుసా! నాకు కాఫీ... టిఫిన్...భోజనం...వగైరాలన్నీ ఆమె నౌకర్లతో ఏర్పాటు చేయిస్తుంది. స్వయంగా ఇవన్నీ తను చెయ్యటానికి ఆమెకు స్టేటస్ అడ్డమొస్తుందిట పాపం!

ఇక నా అర్థాంగి! నేనెంత ఆస్తిపాస్తులు సంపాయించినా నిరంతరం దేనికోదానికి నన్ను సాధిస్తూ వేధిస్తూ నాతో రజతోత్సవ వైవాహిక జీవితం గడిపి ఆపై ఓపిక లేక తెలియని లోకాలకు తరలిపోయింది.

నాదో శాపగ్రస్త జీవితం తల్లీ! ఏం చేసుకోనమ్మా ఈ ఆస్తి? నేనెవరికీ అక్కరలేదు. నా ఆస్తి మాత్రమే అందరికీ కావాలి. అదికాస్త రాసేస్తే ఇక నా గతి కుక్కలకు కూడా పట్టదు.

నేను ఇంతకు ముందు కుదుర్చుకున్న వంట మనుషులు...పని మనుషులు... ఎందరున్నా ఏకాకిలా జీవితం గడుపుతున్నాను. హోటల్ భోజనం...మఠం నిద్దలా.

ఇలాంటి నా ఎడారి జీవితంలో ఎదురింటిలోకి అద్దెకు వచ్చిన నువ్వు మీవారు నాకు ఒయాసిస్సులా కనుపించారు. కనలేకపోయిన కూతుర్ని నీలో చూసుకుంటూ...నీతో మానసికంగా మమతానుబంధం పెంచుకున్నాను తల్లీ! అందుకనే నమ్మా రోజూ ఉదయం పూట కాఫీ నీ చేతులమీదుగా అందుకుని తాగేది.

కానీ నేను చేసే ఈ పనివల్ల నువ్వు మానసికంగా చిత్రవధ అనుభవిస్తున్నావని తెలిసి కావాలని రామేశ్వరం తీర్థయాత్రకు వెడుతున్నానమ్మా. ఈ ఇంటి ఎదురుగా వుంటూ నిన్ను చూస్తూ నీ చేతి కాఫీ తాగకుండా వుండలేనమ్మా...ఈ ముసలి బాబాయ్ పసి మనస్తత్వాన్ని క్షమించు తల్లీ!

పరమేశ్వర్ చాలా మంచివాడు. అతనికి నా హృదయపూర్వకమైన ఆశీస్సులు. వుంటాను తల్లీ!

నీకు అప్రియమైన
బాబాయ్
మాధవయ్య

